సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 6 । ఏప్రిల్ । 2024





## టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా 14 వేలు, సరాసరిన రూ.20 వేల ప్రకారం పలికాయి.



## కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.12 ధర పలికింది. మార్కెట్‌కు 150 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

## రంజాన్ వేళలు

| శనివారం | ఆదివారం |
|---|---|
| సాయంత్రం | ఉదయం |
| ఇఫ్తార్ : 6.35 | సెహరీ : 4.56 |



## న్యూస్‌రీల్

### జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివి

- జయంతి వేడుకల్లో కలెక్టర్ అరుణ్‌బాబు



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

**పుట్టపర్తి అర్బన్:** కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దాదాపు మూడు దశాబ్దాల పాటు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ కొండయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో కలిసి బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... విద్యతోనే సమాజంలో అసమానతలు రూపుమాపడం సాధ్యమని నమ్మిన జగ్జీవన్‌రామ్ నిరుపేదలకు విద్యావెలుగులు పంచడంలో ఎంతో కృషి చేశారన్నారు. కార్మిక మంత్రిగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర ఉద్యోగుల బీమా చట్టం తీసుకురావడంతో పాటు ప్రావిడెంట్‌ఫండ్‌ను ఏర్పాటు చేసి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వ్యవసాయ మంత్రిగా కరువు నివారణ చర్యలు చేపట్టి హరిత విప్లవాన్ని ప్రోత్సహించారన్నారు. సమసమాజ స్థాపనకు జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని, ఆయన బాటలో అందరం నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఆర్డీఓ కరుణసాగర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లేడుగుంట ఆలయ హుండీ కానుకల లెక్కింపు



ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

**మడకశిర రూరల్:** మండల పరిధిలోని జిల్లేడుగుంటలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి భక్తుల హుండీ ద్వారా సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. 8 నెలల కాలానికి గానూ హుండీల ద్వారా రూ.10,31,427 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. హుండీల లెక్కింపులో దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీలను లెక్కించనున్నట్లు అధికారులు తెలిపారు.

# పల్లె పల్లెనా అసమ్మతి

'పల్లె'ను పల్లెపల్లెనా అసమ్మతి భయపెడుతోంది. సొంత పార్టీలోని వ్యతిరేక వర్గం గ్రామగ్రామానా పొగరాజేస్తోంది. కోడలు సింధూరరెడ్డిని బరిలోకి దించినా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఆమె జనంతో మమేకం కాలేకపోతున్నారు. నేటికీ తండాల వైపు కన్నెత్తి చూడలేదు. పైగా పుట్టపర్తి అభివృద్ధికి 'పల్లె' ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో ప్రజలు స్పందించడం లేదు. దీంతో పల్లె గిమ్మిక్కు రాజకీయం చేస్తున్నారు. సొంతపార్టీ కార్యకర్తలకే పచ్చ కండువాలు వేస్తూ చేరికల పేరుతో ప్రచారం చేస్తుండగా.. టీడీపీ నేతలే ఏవగించుకుంటున్నారు.

- పల్లె రఘునాథరెడ్డిపై తీవ్ర వ్యతిరేకత
- కోడలు సిధూరరెడ్డిని ఎన్నికల బరిలో దించినా అదే తీరు
- మామాకోడలు అనంత నుంచే రాకపోకలపై విమర్శలు
- స్థానికేతరులను విశ్వసించబోమంటున్న ప్రజలు
- నేటికీ తండాల గడపతొక్కని టీడీపీ అభ్యర్థి
- ప్రచారంలో కలసిరాని అసమ్మతి నాయకులు
- ఓటర్లను ఆకట్టుకునేందుకు 'పల్లె' గిమ్మిక్కులు
- టీడీపీ వారికే కండువాలు వేసి చేరికల పేరుతో ప్రచారం




**పుట్టపర్తి:** చంద్రబాబు మోసాలు.. పల్లె గిమ్మిక్కులు వెరసి పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ నూతన అభ్యర్థిని ప్రజలు విశ్వసించడం లేదు. దీనికి తోడు మామ వైఫల్యాలు కోడలిని వెంటాడుతున్నాయి. టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి అవగాహన రహిత్య ప్రసంగాలు సైతం ఆ పార్టీ శ్రేణులను ఆందోళనలో పడేస్తున్నాయి.

**పెరుగుతున్న అసమ్మతి స్వరం..**

ఒకట్రెండు కాదు... ఏకంగా పది.. పదహైదేళ్లుగా తమను రాజకీయంగా ఎదగకుండా పల్లె రఘునాథరెడ్డి అణచివేశారంటూ కొందరు తెలుగు తమ్ముళ్లు కొన్నేళ్లుగా అసమ్మతి స్వరం పెంచుతూ వచ్చారు. కార్యకర్తలను ఏ మాత్రమూ పట్టించుకోకుండా తన ఎదుగుదలపైనే పల్లె రఘునాథరెడ్డి దృష్టి సారించారంటూ పలుమార్లు పార్టీ అధిష్టానం దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. అయినా అధిష్టానం పల్లె రఘునాథరెడ్డి వైపే మొగ్గు చూపుతూ వచ్చింది. ఇది కాస్తా కార్యకర్తల్లో మరింత అసహనానికి కారణమైంది. ఈ క్రమంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతిలో పల్లె ఘోరంగా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత ఆయన నియోజకవర్గంలో పెద్దగా కనిపించలేదు. ఎప్పుడో ఒకసారి రావడం... రాజకీయ లబ్ధి పొందేందుకు కార్యకర్తలను రెచ్చగొట్టి పోవడం ఓ ప్రహసనంగా మారింది.

**మా తడాఖా చూపిస్తాం..**

ఏడాది కాలంగా పుట్టపర్తి టీడీపీలో అసమ్మతి జ్వాలలు పెద్దఎత్తున ఎగిసిపడుతూ వచ్చాయి. దీంతో ఈసారి తమకు పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వడ్డెర్లు పలుమార్లు చంద్రబాబును కలసి విన్నవించారు. ఆ సమయంలో వీరి అభ్యర్థనలకు చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అయితే తీరా ఎన్నికల సమయం దగ్గర పడగానే వడ్డెర్లను పక్కనపెట్టి పల్లె రఘునాథరెడ్డి వైపే మొగ్గు చూపారు. ఆయన కోడలు సింధూరరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో వడ్డెర్లలో ఒక్కసారిగా అసహనం పెరిగిపోయింది. గత నెల అనంతపురం కేంద్రంగా ఉమ్మడి జిల్లాకు చెందిన వడ్డెర్లు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి.. చంద్రబాబు మోసాలు, పల్లె గిమ్మిక్కులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబుకు సరైన బుద్ధి చెప్పేందుకు ఈ ఎన్నికల్లో టీడీపీకి ఎలాంటి పరిస్థితుల్లోనూ సహకరించబోమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్, అమడగూరు మాజీ జెడ్పీటీసీ పురుషోత్తమరెడ్డి తదితరులు ఇటీవలే వైఎస్సార్ సీపీలో చేరారు. జగన్ నాయకత్వాన్ని బలపరుస్తూ ఊరూవాడా ప్రచారానికి సిద్ధమయ్యారు.

**తండాల గడప తొక్కని సింధూర..**

ఒకపక్క వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి అపర్ణారెడ్డి ప్రతి తండాలకు వెళ్లి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నల్లమాడ, పుట్టపర్తి పరిధిలోని పలు తండాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే టీడీపీ అభ్యర్థి సింధూరరెడ్డి మాత్రం ఇప్పటిదాకా తండాల గడప తొక్కలేదు. తన హయాంలో ఏ ఒక్క తండాను 'పల్లె' పట్టించుకోలేదు. అందువల్లే గిరిజనులంతా ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఈక్రమంలో ఏ తండాకు వెళ్లినా అడ్డుకోవడం ఖాయమని నిర్ణయించుకున్న 'పల్లె' కోడలిని తండాలకు పంపడం లేదని తెలుస్తోంది.

**పచ్చ నేతలకే కండువాలు కప్పి..**

జనం నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో 'పల్లె' గిమ్మిక్కులు చేస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సొంత పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలను వైఎస్సార్‌సీపీకి చెందిన వారిగా పేర్కొంటూ వారికే టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. అది కూడా 20 మందిని ఫొటోల్లో చూపి 200 కుటుంబాలంటూ మాయ చేస్తున్నారు. దీన్ని చూసిన స్థానికులు నవ్వుకుంటుండగా.. టీడీపీ నేతలే పల్లె గిమ్మిక్కు రాజకీయాలను ఏవగించుకుంటున్నారు.

**అనంతపురం నుంచే అప్ అండ్ డౌన్..**

పుట్టపర్తి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించిన మరుసటి రోజే పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరరెడ్డితో కలిసి కొత్తచెరువులో ప్రచారం ప్రారంభించారు. పట్టుమని 10 నిమిషాలు కూడా సాగకముందే ఆమె స్పృహతప్పి పడిపోయారు. ఆ తర్వాత కూడా ఆమె పెద్దగా ప్రచారం చేయడం లేదు. దూరంనుంచే ప్రజలకు దండం పెట్టి వెళ్లిపోతున్నారు. పైగా అనంతపురంలో నివాసముంటున్న ఆమెను... ఇక్కడి ప్రజలు విశ్వసించడం లేదు. ఒకవేళ ఆమె గెలిస్తే తన అధికారాన్ని మామ చేతిలో పెట్టి భర్తతో కలసి విదేశాలకు వెళ్లిపోతారనే ప్రచారం కూడా సర్వత్రా సాగుతోంది. ఇలాంటి తరుణంలో పల్లె సింధూర అభ్యర్థిత్వంపై ప్రజలు విముఖత చూపుతున్నారు.

**వైఎస్సార్ సీపీకే 'తమ్ముళ్ల' మద్దతు..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయి. పైగా పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించింది. దీంతో నియోజకవర్గ రూపురేఖలే మారిపోయాయి. గడచిన 58 నెలల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తీవ్రంగా శ్రమించారు. సీఎం జగన్ సహకారంతో రెండు జాతీయ రహదారులతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. తాజాగా 193 చెరువులను నింపే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి గెలిచి ఏకంగా మంత్రి పదవి చేపట్టిన పల్లె రఘునాథరెడ్డి రూ.వేల కోట్లు సంపాదించినప్పటికీ పుట్టపర్తి ప్రాంత అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విద్యావేత్తగా పేరుగాంచిన ఆయన, పుట్టపర్తిలో ఒక్క విద్యాసంస్థనూ ప్రారంభించలేదు. కేవలం తన రాజకీయం కోసమే పుట్టపర్తి ప్రాంతాన్ని ఎంచుకున్నారు. అందువల్లే ఈప్రాంత ప్రజలే కాదు టీడీపీ నాయకులూ ఆయన్ను నమ్మడం లేదు. ఈ క్రమంలో అందరి దృష్టి ఇప్పుడు వైఎస్సార్‌సీపీపైనే ఉంది. తాజాగా సీఎం జగన్ జిల్లాలో చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు ప్రజలు పోటెత్తడం కూడా ఇందుకు సంకేతంగా కన్పిస్తోంది. పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు సైతం బయటపడకపోయినా... వైఎస్సార్‌సీపీ పాలనే బాగుందంటూ లోలోన కితాబునిస్తుండడం గమనార్హం.

### ఆలయంలో రాజకీయ కార్యక్రమం

- కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు



చిలమత్తూరులో బాలకృష్ణ పీఏ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**చిలమత్తూరు:** టీడీపీ నేతలు గుడి, బడినీ ఎన్నికల ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా... యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. తాజాగా శుక్రవారం చిలమత్తూరు నరసింహస్వామి దేవాలయం వద్ద పార్టీలో చేరికల కోసం టీడీపీ నేతలు షామియానాలు వేసి హంగామా చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విషయం తెలుసుకున్న డీటీ యూనిస్ తన బృందంతో అక్కడికి వెళ్లి షామియానాను తొలగించారు. కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని చెప్పారు. అనంతరం పోలీసుల సహాయంతో టీడీపీ నేతల్ని అక్కడి నుంచి పంపించి వేశారు. ఇదే విషయంపై డీటీని వివరణ కోరగా టీడీపీ నేతల కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని, ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

### రాగే పరుశురాంకు కీలక పదవి

- డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియామకం



**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా రాగే పరుశురాం నియమితులయ్యారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయన్ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆయన పనిచేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. రాగే పరుశురాం అనంతపురం నగరపాలక సంస్థ మేయర్‌గా 2005 నుంచి 2010 వరకు పనిచేశారు.

### ఉషమ్మకు మద్దతు

పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి ఉషశ్రీకి మద్దతు పెరుగుతోంది. కూటమి కుట్రలు నచ్చక టీడీపీ, జనసేన నేతలు మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. మద్దతు పలికి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరగా, మంత్రి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

– సోమందేపల్లి:



## నేటి నుంచి సమ్మేటివ్-2

**పుట్టపర్తి:** జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం నుంచి 19వ తేదీ వరకూ సమ్మేటివ్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల యాజమాన్యాలకు డీఈఓ మీనాక్షి ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

| తేదీ | 1-5 తరగతులు | 6 నుంచి 9 తరగతులు |
|---|---|---|
| | ఉదయం 9 నుంచి 12 వరకు | ఉదయం 9 నుంచి 12 వరకు (6, 7,8 ) |
| 6-4-24 | తెలుగు/ఉర్దూ | తెలుగు/కాంపోజిట్ తెలుగు/ఉర్దూ |
| 8-4-24 | ఇంగ్లీష్ పార్ట్-ఏ | హిందీ-స్పెషల్ తెలుగు-స్పెషల్ ఇంగ్లీష్ |
| 10-4-24 | ఇంగ్లీష్ పార్ట్-బీ | ఇంగ్లీష్ పార్ట్-ఏ |
| 12-4-24 | మేథమేటిక్స్ | ఇంగ్లీష్ పార్ట్-బీ (టోఫెల్) |
| 13-4-24 | ఈవీఎస్ 3,4,5 తరగతులు | మేథమేటిక్స్ |
| 15-4-24 | ఓఎస్ఎస్‌సీ 3,4,5 తరగతులు | ఫిజికల్ సైన్సు (9 నుంచి 11 గంటల వరకు) |
| 16-4-24 | ఎస్ఎల్ఎఎస్ 4వ తరగతి | బయలాజికల్ సైన్సు (9 నుంచి 11 గంటల వరకు) |
| 18-4-24 | | సోషియల్ స్టడీస్ |
| 19-4-24 | | కాంపోజిట్ సంస్కృతం (9 నుంచి 10.30 వరకు) ఓఎస్ఎస్ పేపర్-1,పేపర్-2 |

# పట్టా పట్టగానే పరిశ్రమ బాట

- పీజీ కోర్సుల్లో సమూల మార్పులు
- నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా విద్యా ప్రణాళిక
- ఎస్కేయూ పరిధిలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సుల్లో నూతన సిలబస్
- పట్టాతో పాటు ఉపాధి కల్పనే ధ్యేయం



**అనంతపురం:** విద్యార్థులకు పట్టా అందించడంతో పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉన్నత విద్యామండలి పీజీ కోర్సుల్లో సమూల మార్పులు ప్రవేశపెట్టింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశ్రమల అవసరాలకు దీటుగా విద్యార్థిని తీర్చిదిద్దే లక్ష్యంతో కొత్త విద్యా ప్రణాళికను అందుబాటులోకి తెచ్చారు. వర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యాలు పెంచనున్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సుల్లో నూతన విద్యా ప్రణాళిక అమల్లోకి రానుంది. వర్సిటీ క్యాంపస్ కళాశాలలతో పాటు అనుబంధ పీజీ కళాశాలల్లోనూ ఈ విధానం అమలు చేస్తారు.

**డిగ్రీతోనే శ్రీకారం..**

పీజీలో ప్రధానంగా పరీక్ష విధానం, మెథడాలజీ, బోధన పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో ప్రవేశపెట్టాల్సిన మార్పులపై దృష్టి సారించారు. ఇప్పటివరకూ డిగ్రీ విద్యలో మేజర్‌గా మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యా బోధన సాగుతోంది. అయితే, విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందులో భాగంగా ఇకపై ఒక మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగేలా మార్పులు తీసుకొచ్చింది. గతంలో బీఎస్సీ- ఎంపీసీ (మూడు సబ్జెక్టుల కాంబినేషన్) ఉండగా ఆ స్థానంలో బీఎస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రెండో సెమిస్టర్ నుంచి దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్యను అభ్యసించేలా మార్పులకు శ్రీకారం చుట్టారు.

**నూతన జాతీయ విద్యా విధానం మేరకు..**

నూతన జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా పీజీ కోర్సు సిలబస్ రూపకల్పన చేశారు. కొత్తగా రెండు స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టారు. గతంలో కేవలం ఒక కోర్సు మాత్రమే ఉండేది. ఇకపై పీజీలో మూడు సబ్జెక్టు కోర్ పేపర్లు ఉండనున్నాయి. నాలుగో సెమిస్టర్ మొత్తం ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలి. ఇక.. పీజీ మూడో సెమిస్టర్‌లో ఏ,బీ రెండు ఆప్షన్లు ఇచ్చారు. రీసెర్చ్ మెథడాలజీ ప్రవేశపెట్టారు. రీసెర్చ్ మెథడాలజీ విద్యార్థుల ఆసక్తి మేరకు చదువుకోవచ్చు. లేకపోతే వారి పీజీ కోర్సు సబ్జెక్టులను చదువుకోవచ్చు. త్వరలో సిలబస్ అంశంపై బోర్డ్‌ఆఫ్ స్టడీస్ సమావేశంలో ఆమోదం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

### ప్రపంచంతో పోటీపడేలా తర్ఫీదు



ప్రపంచంతో పోటీ పడేతూ మన విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించాలి. నాణ్యమైన విద్య ద్వారానే ఇది సాధ్యం. అందుకు విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలి. అప్పుడే మన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు వస్తాయి. ఇందులో భాగంగా పీజీ కోర్సులో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నాం. నైపుణ్యాలు పెంపొందించే రీతిలో కోర్సులు రూపకల్పన చేయనున్నాం.

– ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, వీసీ, ఎస్కేయూ

### దేశంలో తొలి రాష్ట్రం



ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు ఉండాలి. అప్పుడే ఉపాధి అవకాశాలు దక్కుతాయి. నైపుణ్యం లేకుండా కోర్సులు పూర్తి చేస్తే ఫలితం లేదు. ఈ క్రమంలో పీజీ కోర్సు పూర్తిగా నైపుణ్య కోర్సులుగా తీర్చిదిద్దనున్నాం. ఇందులో భాగంగానే పీజీ నాలుగో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్‌కు కేటాయించారు. ఇప్పటి దాకా ఇలాంటి విద్యా ప్రణాళికను ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. దేశంలో తొలి రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు దక్కనుంది.

– ప్రొఫెసర్ ఎంపీ లక్ష్మయ్య, రిజిస్ట్రార్, ఎస్కేయూ

# సలసల మండుతున్న సూరీడు



అనంతపురంలో పైపులైన్ వద్ద వస్తున్న నీటితో దాహం తీర్చుకుంటున్న మూగజీవాలు

**అనంతపురం అగ్రికల్చర్:** సూరీడు సలసల మండుతున్నాడు. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత పెరగడంతో ఉమ్మడి 'అనంత' అగ్నిగుండంలా మారింది. వైశాఖం రాకమునుపే భానుడు భగ్గుమంటుండడంతో జనజీవనానికి ఇబ్బందిగా తయారైంది. శుక్రవారం గుంతకల్లు మండలం పాతకొత్తచెరువులో ఏకంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. అలాగే తాడిపత్రి 43.8 డిగ్రీలు, శింగనమల 43.6 డిగ్రీలు, యల్లనూరు 43.4 డిగ్రీలు, కూడేరు 42.7 డిగ్రీలు, బొమ్మనహాళ్ 42.6 డిగ్రీలు, అనంతపురం, యాడికి 42.2 డిగ్రీలు, బుక్కరాయసముద్రం 42.1 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 27 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో కూడా గ్రీష్మతాపం కొనసాగుతోంది. పుట్టపర్తిలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా పరిగి, చెన్నేకొత్తపల్లి 42.5 డిగ్రీలు, కొత్తచెరువు 42.4 డిగ్రీలు, ముదిగుబ్బ 42.2 డిగ్రీలు, ధర్మవరం, కదిరి, తలుపుల 42.1 డిగ్రీల గరిష్టం నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. గాలిలో తేమశాతం మధ్యాహ్న సమయంలో కొన్ని ప్రాంతాల్లో 15 శాతానికి పడిపోతుండగా మిగతా ప్రాంతాల్లో 20 శాతం వరకు రికార్డవుతోంది. వడదెబ్బను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం, నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండల ప్రభావంతో ప్రజలే కాదు.. పశుపక్షాదులూ విలవిల్లాడుతున్నాయి.

## క్లుప్తంగా

### జగ్జీవన్‌రామ్ ఆశయాలు కొనసాగిద్దాం



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: దేశ తొలి దళిత ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాలు కొనసాగించాలని యువతకు ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎస్పీ మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. సామాజిక న్యాయం కోసం జగ్జీవన్ రామ్ సాగించిన కృషిని గుర్తు చేశారు. సంస్కరణల అమలులో భాగంగా తన పదవులను సైతం త్యాగం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఆర్ఐ మహబూబ్‌వలి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### కారు ఢీ... వ్యక్తి మృతి



అపస్మారక స్థితికి చేరుకున్న బుడెన్ సాహెబ్

మడకశిర రూరల్: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం బి.రాయాపురం గ్రామానికి చెందిన బుడెన్‌సాహెబ్ (38) శుక్రవారం ఉదయం తన స్కూటీ వాహనంపై మడకశిరకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని అయ్యవారిపల్లి బస్టాండ్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవా కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. మృతునికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఓ రోజు జాగరణ..
# వెయ్యి మాసాల పుణ్యఫలం

- పాపపుణ్యాల క్షమార్హ దినంగా షబేఖదర్
- నేడు జాగరణకు ముస్లింలు సన్నద్ధం



బత్తలపల్లి: ముస్లింలకు శుభప్రదమైన, పుణ్యప్రదమైన రాత్రి షబేఖదర్ (షబ్–ఏ–ఖదర్) రానేవచ్చింది. రంజాన్ మాసంలోని చివరి వారంలో 26వ రోజు రాత్రిని షబేఖదర్‌గా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనినే సతామి, లైలతుల్ ఖదర్ అని కూడా పిలుస్తారు. షబే అంటే రాత్రి, ఖదర్ అంటే గౌరవమైన అని అర్థం. ఈ ఒక్కరోజు జాగరణతో చేసే ఆరాధనతో వెయ్యి మాసాల పుణ్యఫలం దక్కుతుందని ఖురాన్ ప్రబోధిస్తోంది.

**రంజాన్ మాసం ఏం చెబుతోంది..**

రంజాన్ మాసంలో చేసిన ఆరాధనలు, ఆచరించిన ఉపవాసాలు, సత్‌క్రియలన్నీ మనం పెంచే మొక్కల్లాంటివే. మొక్క నాటి నప్పటి నుంచి నీరు పోసి సంరక్షించినప్పుడే అది ఎదిగి ఫలాలను అందజేస్తుంది. లేకుంటే కాస్త పెరిగుతున్న సమయంలోనే వాడి పోతుంది. అలాగే రంజాన్ మాసంలో పాటించిన ఆరాధనలు, సత్‌క్రియలను మిగిలిన 11 నెలలూ ఆచరణలో పెట్టినప్పుడే వాటి ఫలాలు అనుభవించగలుగుతామని చెబుతోంది. విశ్వాసులు రంజాన్ తర్వాత వచ్చే 11 నెలలూ అల్లాహ్ వైపు తమ దృష్టి మరల్చాలన్నదే ఖురాన్ ఉద్బోధ.

**నేడు జాగారణ..**

వేయి మాసాల రాత్రుల కన్నా ఘనమైన రాత్రి లైలతుల్‌ఖదర్ అని ముస్లింలు విశ్వసిస్తారు. ఈ రాత్రే అల్లా ఆజ్ఞ మేరకు దివి నుంచి భూవికి దైవ దూతల ద్వారా దివ్య ఖురాన్ అవతరించిందని నమ్మకం. ఖురాన్ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఆ రోజు రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలతో ముస్లింలు జాగరణ చేస్తారు. ఇందుకు శనివారం వేదికైంది. రాత్రి నుంచి శుభోదయం వరకూ మేల్కొని దైవరాధనలో గడపడం వల్ల గత 11 నెలలుగా చేసిన పాపాలను అల్లాహ్ క్షమిస్తాడని ముస్లింల విశ్వాసం. అందుకే షబేఖదర్‌ను ఇన్సాఫ్‌కే రాత్ (న్యాయ నిర్ణేత రాత్రి) అని కూడా భావిస్తుంటారు. ఈ నేపథ్యంలో షబేఖదర్‌ను షబేఖదర్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సిద్ధమయ్యారు.

**సకల పాపాలు ప్రక్షాళన**



రంజాన్ మాసంలో షబేఖదర్ పేరుతో చేసే జాగరణ సకల పాపాలను ప్రక్షాళన చేస్తుంది. ఈ రాత్రి నమాజ్‌లో విధిగా అందరూ పాల్గొనాలి. ఇబాదత్ చేస్తే వెయ్యి మాసాల పుణ్యఫలం దక్కుతుంది. ఇది చాలా ప్రత్యేకమైన రాత్రి. మనస్ఫూర్తిగా ప్రార్థిస్తే అల్లాహ్ మనం గతంలో చేసిన పాపాలన్నింటిని తుడిచేసి పుణ్యఫలాలను అందజేస్తారని ఖురాన్ ప్రబోధిస్తోంది.

– కరీంసాహెబ్, ముతవల్లి, బత్తలపల్లి

## 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్



హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మే 1న పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ల సందడి నెలకొంది. ఈ క్రమంలో విధి నిర్వహణ కారణంగా పోలింగ్ రోజు ఓటు వేసే అవకాశం లేని 33 అత్యవసర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. పోలింగ్ రోజు వార్తా సేకరణలో ఉండే విలేకరులకూ ఈ సౌలభ్యాన్ని కల్పించడం విశేషం. అయితే ఎన్నికల సంఘం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని కలిగి ఉండాలి. పోలింగ్ రోజు ఓటు వేయలేని వయో వృద్ధులు, దివ్యాంగుల కోసం ఇప్పటికే ఫారం–12డీ ను అందుబాటులో ఉంచారు. మొత్తం ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఓ నోడల్ అధికారిని సైతం నియమించారు.

**అత్యవసర శాఖలు ఇవే...**

మెట్రో, రైల్వే రవాణా సేవలు, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కోఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ, అటవీశాఖ, సమాచార ప్రజా సంబంధాలశాఖ, పోలీసు, పౌర రక్షణ–హోం గార్డులు, ఆహార పౌరసరఫరాలు–వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్టుమెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లు, విపత్తు నిర్వహణ.

**పోస్టల్ బ్యాలెట్ పొందడం ఇలా..**

- పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి ఫారం–12డీను భర్తీ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి.
- దరఖాస్తులో వ్యక్తిగత వివరాలు, ఓటరు గుర్తింపు సమాచారం, పోస్టల్ బ్యాలెట్ ఎందుకు కోరుతున్నారో వివరించాలి.
- వాటిని రిటర్నింగ్ అధికారి పరిశీలించి అర్హత ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేస్తారు.
- పోస్టల్ బ్యాలెట్ పేపర్లతోపాటు డిక్లరేషన్ ఫారం, సీక్రసీ స్లీవ్, ప్రీ పెయిడ్ రిటర్న్ ఎన్వలప్‌లను రిటర్నింగ్ అధికారి ఓటర్ల చిరునామాకు పంపుతారు.
- ఓటరు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి డిక్లరేషన్ ఫారం భర్తీ చేయాలి. బ్యాలెట్ పేపరు, డిక్లరేషన్ ఫారం, సీక్రసీ స్లీవ్‌లో ఉంచి దానిని ప్రీపెయిడ్ ఎన్వలప్‌లో ఉంచి, ఆ కవరుపై సరిపడు పోస్టల్ స్టాంప్ అంటించి సకాలంలో తిరిగి పంపాలి.
- సర్వీసు ఓటర్లకు సంబంధించి రిటర్నింగ్ అధికారి సిఫారసు మేరకు నేరుగా వారి కార్యాలయం ద్వారా పోస్టల్ బ్యాలెట్లు అందజేశారు.
- భారతదేశం వెలుపల విధులు నిర్వర్తిస్తున్న సర్వీసు ఓటర్లకు విదేశాంగశాఖ ద్వారా పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తారు.
- 85 ఏళ్లు పై బడిన వారి ఇంటి వద్దకే ఇద్దరు పోలింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్, సెక్యూరిటీ వచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. వీరు ఏ తేది, ఏ సమయంలో వచ్చేది ముందుగానే సమాచారం ఇస్తారు.

### విద్యుదాఘాతంతో వివాహిత మృతి



వీరనాగమ్మ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతిచెందింది. స్థానికులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో నివాసముంటున్న గంగన్న, వీరనాగమ్మ (45) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నాయనపల్లి నుంచి ఏడేళ్ల క్రితం వీరు న్యామద్దెల గ్రామానికి వలస వచ్చారు. అక్కడే వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్నేళ్ల క్రితం ఓ రైతుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని పంటల సాగు చేపట్టారు. ఉగాది పండుగ సమీపిస్తుండడంతో శుక్రవారం ఇంటికి సున్నం వేసే పనిలో వీరనాగమ్మ నిమగ్నమైంది. బెంచిపై నిలబడి సున్నం కొడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చెన్నేకొత్తపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

## 14న గిరిజనుల ఆత్మీయ సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, వడిత్యా శంకర్‌నాయక్, తదితరులు

ధర్మవరం: ఈ నెల 14న ముదిగుబ్బలోని సొసైటీ గ్రౌండ్‌లో గిరిజనుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు గిరిజన ప్రజాసమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డితో కలసి ఆత్మీయ సమావేశం పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి 500 జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా మార్చి నవశకానికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, జెడ్పీటీసీ సేవేనాయక్, ఎంపీటీసీ హరినాయక్, సర్పంచ్ మునిస్వామినాయక్, సీనియర్ నాయకులు రాందాస్ నాయక్, కుళ్లాయప్ప నాయక్, ప్రవీణ్‌కుమార్ నాయక్, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు కార్డుకు 31 ఏళ్లు







హిందూపురం అర్బన్: ఎన్నికల సమయంలోనే కాదు... ఇతర అత్యవసరాలకు గుర్తింపు కోసం ఉపయోగపడే ఓటరు కార్డు రూపకర్త ఎవరు? ఎప్పుడు వచ్చిందో మీకు తెలుసా? తెలియకపోతే కచ్చితంగా తెలుసుకుందాం రండి... 1950, జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి 1993 వరకూ ఓటరు గుర్తింపుకార్డులనేవి లేనేలేవు. అయితే దొంగ ఓటర్లను నివారించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలనే సదుద్దేశ్యంతో సరిగ్గా 31 ఏళ్ల క్రితం 1993లో అప్పటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే పుట్టుకు వచ్చిన ఓటరు కార్డు ఓ వజ్రాయుధంలా మారింది. తొలిదశలో నలుపు–తెలుపు రంగులో ఉన్న ఓటరు కార్డులను కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసింది. ప్రస్తుతం డిజిటల్ రూపంలో ముద్రించిన కార్డులు అందుబాటులోకి వచ్చాయి.

## స్కార్పియో ఢీకొని వ్యక్తి మృతి





జగన్నాథరెడ్డి (ఫైల్), జగన్నాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: స్కార్పియో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన జగన్నాథరెడ్డి(42)కి భార్య వాసవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓ ప్రైవేట్ ఫర్టిలైజర్ కంపెనీలో సేల్స్‌మెల్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలో బంధువుల ఇంట పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం భార్య వాసవితో కలసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కూడేరులోని సాయిబాబా ఆలయ సమీపానికి చేరుకోగానే ప్రధాన రహదారిపై ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు వద్దకు చేరుకోగానే వరుసగా వెళుతున్న కార్లను తనిఖీ చేసేందుకు ఆపే ప్రయత్నం చేశారు. చివరన వేగంగా దూసుకొచ్చిన స్కార్పియో వాహన డ్రైవర్ ముందు కార్లను ఢీ కొనకుండా ఉండేందుకు ఉన్నఫలంగా తన వాహనాన్ని కుడివైపు తిప్పాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో జగన్నాథరెడ్డి, వాసవి ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఘటనలో జగన్నాథరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. వాసవికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ద్విచక్ర వాహనంలో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. గాయపడిన వాసవిని 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన స్కార్పియో వాహనం ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి ప్రధాన అనుచరుడిదిగా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి కలగళ్లకు చేరుకుని మృతుడికి నివాళుర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

## 'సెబ్' విస్తృత తనిఖీలు



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు చూపుతున్న సెబ్ అధికారులు

హిందూపురం అర్బన్: నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం సెబ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు విడివిడిగా తనిఖీలు చేపట్టారు. సెబ్ ఎస్‌ఐలు కమలాకర్, రామ్‌ప్రసాద్, సిబ్బంది కర్ణాటక సరిహద్దున నిఘా ఉంచి హిందూపురం మండలం పోచనపల్లి మీదుగా ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 5 బాక్సుల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న శివకుమార్‌ను అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే వీరంపల్లి క్రాస్ వద్ద హిందూపురం మండలం మలగూరుకు చెందిన గంగరాజు 39 టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. పట్టణంలోని సడ్లపల్లికి చెందిన నరసింహమూర్తిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేసి 82 ప్యాకెట్లు పళనీనగర్‌కు చెందిన చిన్నతంబిను అరెస్ట్ చేసి 110 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే మండలంలోని బేవనహళ్లి, అప్పలకుంట వద్ద అనధికారికంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. 5 టన్నుల ఇసుకతో పాటు ట్రాక్టర్లను హిందూపురం రెండో పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య



కరుణాకర్ (ఫైల్)

కొత్తచెరువు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు... కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన రైతు కుళ్లాయప్ప కుమారుడు కురుబ కరుణాకర్ (24) గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీ–ఫార్మసీ చదువుతూ మధ్యలో మానేసి ఇంటికి చేరుకున్నాడు. తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉంటూ వచ్చారు. నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న కరుణాకర్‌కు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో రాత్రికి కుటుంబసభ్యులు పొలం వద్దకెళ్లి పరిశీలించారు. అప్పటికే వేపచెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి శుక్రవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, శివారెడ్డి, సీనియర్ నాయకులు బగ్రా రవీంద్రారెడ్డి, డీలర్ శ్రీనివాసులు, కృష్ణారెడ్డి ఉన్నారు.

## రెండు కార్లు ఢీ – ఒకరి మృతి

- ఐదుగురు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన డీఈఓ, డీవైఈఓ

బెళుగుప్ప: మండల పరిధిలో జాతీయ రహదారిపై శుక్రవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఓ వైద్యుడు మృతి చెందారు. ఐదుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తూర్పుగోదావరి జిల్లా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన ఆయుర్వేద విశ్రాంత వైద్యాధికారి నాగేశ్వరప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలసి రాయదుర్గానికి కారులో వెళుతుండగా బెళుగుప్ప మండలం హనిమరెడ్డి పల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో కారు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారులో అనంతపురంలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌లో పాల్గొనే కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఘటనలో రెండు కార్లూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్ర గాయాలతో డాక్టర్ నాగేశ్వరప్రసాద్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. నేత్రపల్లి, దురదకుంట, నరసాపురం, లక్ష్మంపల్లి, బ్రహ్మసముద్రం జెడ్పీహెచ్ఎస్‌ల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు తిప్పేస్వామి, రామశేఖర్, హరికృష్ణ, రామచంద్ర, తిప్పేస్వామికూ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక డాక్టర్ నాగేశ్వర ప్రసాద్ మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న డీఈఓ వరలక్ష్మి, గుత్తి డివిజన్ డీవైఈఓ శ్రీదేవి... ఆస్పత్రికి చేరుకుని ఉపాధ్యాయులను పరామర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

### కేసు నమోదు

కదిరి టౌన్: స్థానిక పూలబజారులో నివాసముంటున్న ఇషాక్‌కు చెందిన రెండు ద్విచక్రవాహనాలకు గురువారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. ఘటనలో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. దీనిపై పట్టణానికి చెందిన ప్రవీణ్‌కుమార్ అనుమానాలు వ్యక్తం చేస్తూ ఇషాక్ చేసిన ఫిర్యాదు మేరకు సీఐ పుల్లయ్య కేసు నమోదు చేశారు. కాగా, గతంలో ఇషాక్, బాలు, ప్రవీణ్‌కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడడంతో కక్ష పెంచుకున్న ప్రవీణ్‌కుమార్ వాహనాలకు నిప్పుపెట్టాడని సీఐ తెలిపారు.

### 15 మందికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చిన దృశ్యం

ఉరవకొండ: ఆటో బోల్తాపడిన ఘటనలో 15 మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం మాళాపురం గ్రామానికి చెందిన మహిళా కూలీలు శుక్రవారం ఉదయం ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామంలో మిరప పంట తొలగించేందుకు ఆటోలో బయలుదేరారు. బూదగవి వద్దకు చేరుకోగానే ఎదురుగా అడ్డు వచ్చిన గొర్రెను తప్పించబోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి రెఫర్ చేశారు.

### కర్ణాటక మద్యం పట్టివేత

కదిరి టౌన్/అర్బన్: కర్ణాటక మద్యం తరలిస్తూ తలుపుల మండలానికి చెందిన కె.అజయ్ పోలీసులకు పట్టుబడ్డాడు. శుక్రవారం ఉదయం తలుపుల నుంచి కదిరికి వస్తుండగా స్థానిక కొత్త బ్రిడ్జి వద్ద వాహన తనిఖీల్లో 180 టెట్రా ప్యాకెట్ల మద్యంతో అజయ్ పట్టుబడినట్లుగా సీఐ పుల్లయ్య తెలిపారు. అలాగే కదిరి మండలం మొటుకుపల్లి వద్ద జాతీయ రహదారిపై అమీర్ బీరువాల ఇండస్ట్రీలో నిల్వ ఉంచిన రూ. 2లక్షలు విలువ చేసే 56 కేసుల కర్ణాటక మద్యాన్ని శుక్రవారం ఉదయం రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని నిల్వ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

### రైల్ కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

గుంతకల్లు: రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయమని డీఆర్ఎం వినీత్‌సింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రైల్వే జంక్షన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వంటగదిని, ఫర్నిచర్‌తోపాటు కోచ్‌కు వివిధ రకాల పెయింట్‌ంగ్‌లకు కితాబునిచ్చారు. ప్రాంగణంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు ఎంతో ఆకర్షణీయంగా ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైల్ కోచ్ రెస్టారెంట్‌లో భోజనానికి, అల్పాహారానికి వచ్చే ప్రయాణికులు, పట్టణ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన పదార్థాలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.